పాలకమండలిని నియమించరా?

- దశాబ్ద కాలంగా ఖాళీగానే..
- పట్టించుకోని నాటి బీఆర్ఎస్.. నేటి కాంగ్రెస్ ప్రభుత్వాలు
- అన్నపురెడ్డిపల్లి బాలాజీ ఆలయ పరిస్థితి ఇదీ..

అన్నపురెడ్డిపల్లి (చంద్రుగొండ): మండలకేంద్రం అన్నపురెడ్డిపల్లిలో వేంచేసి ఉన్న బాలాజీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం పాలకమండలి నియామకంపై పాలకపక్షాలు శీతకన్ను వహిస్తున్నాయి. దీంతో పాలక వ్యవహారాలు కుంటుపడుతున్నాయని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

12 ఏళ్లుగా లేని నియామకం

2013లో అప్పటి ఉమ్మడి మండలం చంద్రుగొండలో అన్నపురెడ్డిపల్లి భాగంగా ఉండేది. అప్పటి కాంగ్రెస్‌పార్టీ నాయకుడు, దివంగత కాపుగంటి సత్యబాబు చివరిసారిగా పాలకమండలి చైర్మన్‌గా వ్యవహరించారు. అప్పటి నుంచి దాదాపు 12 ఏళ్లుగా పాలకమండలి నియామకం జరగలేదు. చారిత్రాత్మక నేపథ్యం ఉన్న వెంకటేశ్వరస్వామికి అగ్రహారంగా సుమారు 2,200 ఎకరాల భూములు ఉన్నాయి. అందులో వ్యవసాయానికి అనుకూలంగా, మరికొంత అటవీప్రాంతంగా ఉన్నాయి.



అన్నపురెడ్డిపల్లిలోని వెంకటేశ్వరస్వామి దేవస్థానం

పట్టింపులేని యంత్రాంగం

ఇదిలాఉండగా దేవాదాయ, ధర్మాదాయ శాఖ సైతం ఈ దేవస్థానంపై పెద్దగా పట్టించుకున్న దాఖలాలు కన్పించడంలేదు. సుమారు రెండు దశాబ్దాలుగా ఆలయం నిర్వహణ ఇన్‌చార్జ్ ఈఓలతోనే కొనసాగిస్తున్నారు. వెంకటేశ్వర స్వామికి ప్రతి ఏటా బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. స్వామివారి తిరుకల్యాణ మహోత్సవానికి తెలంగాణ, ఏపీ రాష్ట్రాల నుంచి వేలాదిమంది భక్తులు హాజరౌతారు. భక్తులపాలిట కొంగుబంగారంగా వర్ధిలుతున్న బాలాజీ వెంకటేశ్వరుడిపై పాలకులు ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని భక్తులు ఆక్రోశం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వం స్పందించాలి



దేవస్థానం పాలకమండలి ఏర్పాటుపై ప్రభుత్వం స్పందించాలి. వందలాది ఎకరాల భూములు, వేలాది మంది భక్తులున్న ఈ ఆలయపాలక మండలి నియామకంపై ఎందుకు స్పందించడం లేదో అర్థం కావడం లేదు.

– మారగాని శ్రీనివాసరావు, శివాలయం వ్యవస్థాపక ధర్మకర్త, అన్నపురెడ్డిపల్లి

ఆలయ పాలన కుంటుపడుతోంది



పాలకమండలి లేకపోవడంతో నిర్వహణ తీరుతెన్నులు కుంటుపడుతున్నాయి. ఆలయానికి పర్మినెంట్ ఈఓ లేకపోవడం కొంత ఇబ్బందికరంగానే ఉంది. స్వామివారికి అగ్రహారంగా ఆస్తులు ఉన్నా ఆదాయం అరకొరగానే ఉంది.

– వనమా గాంధీ, ఆలయ మాజీచైర్మన్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు, అన్నపురెడ్డిపల్లి

సత్వరమే ఏర్పాటు చేయాలి



చారిత్రాత్మక నేపథ్యంలో ఉన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానానికి పాలకమండలి వెంటనే ఏర్పాటు చేయాలి. ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, జిల్లా మంత్రులు సత్వర చర్యలు తీసుకోవాలి. పాలకమండలి ఏర్పాటు జరిగితే ఆలయ అభివృద్ధి ఉంటుంది.

– పర్సా వెంకటేశ్వరరావు, సీనియర్ నాయకుడు, అన్నపురెడ్డిపల్లి

క్లుప్తంగా

వ్యవసాయ రంగంలో మహిళలు రాణించాలి



సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్

భద్రాచలంటౌన్: భద్రాచలం ఏజెన్సీలోని మహిళలు వ్యవసాయ రంగంలోని సంక్షోభాలను అధికమించి రాణించాలని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావ్ అన్నారు. స్థానిక హరిత హోటల్‌లో వ్యవసాయక, సాంఘిక అభివృద్ధి సంస్థ(ఏఎస్‌డీఎస్), స్వచ్ఛంద సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో గ్రామీణ మహిళా రైతులపై వ్యవస్థాగత హింసపై ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆదివాసీ మహిళలకు చదువు ఆవిశ్యకతను వివరించారు. మహిళలు వ్యవసాయ సంక్షోభంలో ఎదుర్కొంటున్న సమస్యలు, సవాళ్లు, అసమానతలు తదితర అంశాలపై చర్చించారు. సదస్సుకు ఉమ్మడి తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు 250 మంది మహిళా రైతులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌డీఎస్ సంస్థ డైరెక్టర్, బాలల హక్కుల కమిషన్ సభ్యులు వి.గాంధీబాబు, సీతామహాలక్ష్మి, నాగరాజు, అంబేద్కర్, రుక్మిణి రావు, ఆశలత, ఇందిర, జమున తదితరులు పాల్గొన్నారు.

గాలి దుమారం.. వర్షం

చర్ల: మండలంలో ఆదివారం రాత్రి భారీగా గాలిగా వీచి.. స్వల్పంగా వర్షం కురిసింది. గాలిదుమారంతో పలు గ్రామాల్లో విద్యుత్ తీగలపై చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఇటు ఎటపాక, అటు ఆలుబాక నుంచి చర్ల మండలానికి వచ్చే 33 కేవీ విద్యుత్ లైన్‌లో కూడా పలు చోట్ల కొమ్మలు విరిగి పడడంతో విద్యుత్ సబ్ స్టేషన్లకు కూడా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఉరుములు, మెరుపులతో స్వల్పంగా వర్షం కూడా కురవడంతో పలు గ్రామాల్లో రైతులు కళ్లాల్లో ఆరబోసిన ధాన్యం, మిర్చి పంటలు తడిశాయి.

ధర్నా పోస్టర్లు ఆవిష్కరణ

మణుగూరురూరల్: బొగ్గు గనుల వేలం, సింగరేణి ప్రైవేటీకరణపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలకు నిరసనగా ఈ నెల 25న సింగరేణి వ్యాప్తంగా జీఎం కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని టీబీజీకేఎస్ కోరింది. ఈ మేరకు ముద్రించిన ధర్నా వాల్ పోస్టర్లను బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు ఆదివారం స్థానిక తెలంగాణ భవన్ వద్ద ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు నాగెల్లి వెంకటేశ్వర్లు, బీఆర్ఎస్ మండల కన్వీనర్ కుర్రి నాగేశ్వరరావు, పట్టణ కన్వీనర్ కుంటా లక్ష్మణ్, టీబీజీకేఎస్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రజితోత్సవ సభ పోస్టర్లు..

గుండాల: ఈ నెల 27వ తేదీన ఎల్కతుర్తిలో నిర్వహించనున్న బీఆర్ఎస్ రజోత్సవ సభకు పార్టీ కార్యకర్తలు తరలిరావాలని పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు పిలుపునిచ్చారు. ఆదివారం ఆళ్లపల్లి మండల కేంద్రంలో సభ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ సభకు అన్ని గ్రామాల నుంచి అధిక సంఖ్యలో పార్టీ నాయకులు మాజీ ప్రజాప్రతినిధులు తరలిరావాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొండ్రు మంజు భార్గవి, మాజీ జెడ్పీటీసీ కొమరం హనుమంతరావు ,పాయం నరసింహారావు, ఖయ్యుం బాబా, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సమస్యలు పరిష్కరించాలి



ఇంటింటి సర్వేలో సీపీఎం నాయకులు

దుమ్ముగూడెం: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలు సంపూర్ణంగా వెంటనే అమలు చేయాలని, గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి వర్గ సభ్యులు బొల్లి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని తురుబాక గ్రామంలో ఆ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక సమస్యలపై ఇంటింటి సర్వే నిర్వహించగా.. గత కొన్ని రోజులుగా మిషన్ భగీరథ వాటర్ రావడం లేదని, వీధిలైట్లు సరిగ్గా పనిచేయడం లేదని ప్రజలు సీపీఎం బృందానికి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాతూ.. ప్రభుత్వం మహాలక్ష్మి పథకం కింద మహిళలకు రూ.2500 ఇవ్వాలని, రూ.4వేల పెన్షన్ వెంటనే అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సోషల్ మీడియా మండల కన్వీనర్ కుమ్మరికుంట సాంబశివరావు, చెలికని వెంకన్న, గుమ్మడి సూర్యం, కృష్ణ, గుంజలా శ్రీనివాస్, బొల్లి ఖాదర్ బాబు, గుమ్మడి చిన్నక్క, బేతం రత్నం, నిర్మల, మోతుకూరి వెంకటి, తదితరులు పాల్గొన్నారు.

చెరువుల మరమ్మతుకు శంకుస్థాపన



దమ్మపేట: ముష్టిబండలో చెరువు మరమ్మతు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జారే

దమ్మపేట: మండలంలోని నాగుపల్లి, నాయుడుపేట, గున్నేపల్లి, ముష్టిబండ, దమ్మపేట, లింగాలపల్లి గ్రామాల పరిధిలోని చెరువులు, నీటి కుంటలు, పంట కాలువల మరమ్మతుల పనులకు ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, స్థానిక నాయకులతో కలసి ఆదివారం శంకుస్థాపన చేశారు. మరమ్మతుల వల్ల నీటి లభ్యతతో పాటుగా భూగర్భ జలాలు పెరుగతాయని ఎమ్మెల్యే తెలిపారు. రాబోయే వర్షకాలంకు ముందుగానే పనులు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ముష్టిబండలో పలువురిని పరామర్శించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ సురేష్, డీఈ కృష్ణ, ఏఈలు కృష్ణ, గోపాల్, కాంగ్రెస్ నాయకులు రావు గంగాధర రావు, కోటగిరి సత్యంబాబు, చిన్నశెట్టి యుగంధర్, అత్తులూరి వెంకటరామారావు, దొడ్డా భాస్కర రావు, చిట్టిబాబు, రొయ్యల కుమార్, కొయ్యల ప్రసాద్, ముళ్లపూడి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వాటర్ కూలర్ ప్రారంభం

అశ్వారావుపేట: అశ్వారావుపేట ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన రెండు వాటర్ కూలర్‌లను ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆదివారం ప్రారంభించారు. ఆస్పత్రికి వాటర్ కూలర్‌లు మంజూరు చేసిన జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌కు, కృషి చేసిన ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రవిబాబుకు ఆస్పత్రి సూపరింటిండెంట్ డాక్టర్ రాధా రుక్మిణి ధన్యవాదాలు తెలిపారు.

ఎఫ్‌బీఓ క్వార్టర్‌కు మరమ్మతులు

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట గ్రామంలో ఎన్నో ఏళ్లుగా నిరూపయోగంగా, పాడైన భవనంలా ఉన్న ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ క్వార్టర్ కొత్త రూపును సంతరించుకుంటోంది. 1996లో ప్రారంభించిన క్వార్టర్ భవనాన్ని కొన్ని ఏళ్లు ఉపయోగించగా.. ఎన్నో ఏండ్లుగా నిరూపయోగంగా చెత్తా చెదారంతో అపరిశుభ్రంగా తయారైంది. ఇటీవల ఇరవెండి సెక్షన్ ఇన్‌చార్జ్ ఆఫీసర్‌గా బాధ్యతలు చేపట్టిన నాగరాజు చొరవ తీసుకుని విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు ఆదివారం మరమ్మతుల పనులకు శ్రీకారం చుట్టారు. దాతల సహకారంతో భవనం రూపురేఖలు మార్చి క్వార్టర్ నుంచే మొండికుంట బీట్ ఆఫీసర్ విధులు నిర్వహిస్తారని నాగరాజు తెలిపారు.



భవనం మరమ్మతు పనులు పర్యవేక్షిస్తున్న ఎఫ్ఎస్ఓ నాగరాజు

కుమురం భీం స్ఫూర్తితో పోరాడాలి



కుమురం భీం విగ్రహం కోసం శంకుస్థాపన చేస్తున్న నాయకులు

గుండాల: నేటి యువత కొమరం భీం స్ఫూర్తితో అసమానతలు, అన్యాయాలపై ఉద్యమించాలని ఆళ్లపల్లి మాజీ ఎంపీపీ కొండ్రు మంజు భార్గవి పిలుపునిచ్చారు. ఆళ్లపల్లి మండల కేంద్రంలో ఆదివాసీ కమ్యూనిటీ హాల్ స్థల ప్రాంగణంలో కొమరం భీం విగ్రహ ఆవిష్కరణకు ఆదివారం శంకుస్థాపన చేశారు. ఆదివాసీ ఐక్య కార్యాచరణ సమితి మండల అధ్యక్షుడు పాయం రమేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. కొమరం భీం ఆదివాసీల ఆశాజ్యోతి అని, వారి హక్కుల కోసం పోరాడరని తెలిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కుమురం హనుమంతరావు, మాజీ ఎంపీపీ పడిగ సమ్మయ్య, మాజీ సర్పంచ్ మెస్సు కోటేశ్వరరావు, ఈసం సాంబశివరావు, పీఏసీఎస్ డైరెక్టర్, ఏఈడబ్ల్యూసీఏ జిల్లా కార్యదర్శి జోగ రాంబాబు, ఊకే కిషోర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

భూములకు రక్షణ కల్పించండి

మణుగూరుటౌన్: మండల పరిసర ప్రాంతాల్లో స్థానిక తహసీల్దార్ స్వాధీనం చేసుకున్న భూములకు రక్షణ లేకుండా పోతోందని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య అన్నారు. ఆదివారం స్థానిక మండల కమిటీ సమావేశం పార్టీ కార్యక్రమంలో ములకల ఉత్తం అధ్యక్షతన జరగ్గా ఆయన హాజరై మాట్లాడారు. కొండాయిగూడెం ప్రాంతంలో భూస్వామి దగ్గర 20 ఎకరాల భూమిని స్వాధీన పరుచుకుని చుట్టూ ఫిన్సింగ్ వేశారని, కానీ ఆ భూమిలో ట్రాక్టర్లతో భూమిని అజ్ఞాత వ్యక్తులు చదును చేశారని అన్నారు. అది ఎవరు చేశారో తేల్చాలని డిమాండ్ చేశారు. అక్రమంగా చొరబడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని, ప్రభుత్వ భూమిని కాపాడాలని తహసీల్దార్‌ను కోరారు. ఈ విషయంపై ఐటీడీఏ పీఓ, కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేస్తామన్నారు. సమావేశంలో మండల కార్యదర్శి సత్రపల్లి సాంబశివరావు, మండల కార్యదర్శి వర్గ సభ్యులు దామల్ల లెనిన్ బాబు, పిట్టల నాగమణి, ఉప్పతల నర్సింహారావు, పల్లపు నాగేశ్వరరావు, పసునూరి సంజీవరెడ్డి, అల్లె సుధాకర్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు అన్నవరపు కనకయ్య

నేడు విద్యుత్ కోత

దమ్మపేట: మండలంలోని గండుగులపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు నేడు (సోమవారం) విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, విద్యుత్ శాఖ ఏడీఈ వెంకటరత్నం ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం గండుగుపల్లి సబ్‌స్టేషన్‌లో 33 కేవీ లైన్ మరమ్మతులు నిర్వహించనున్న కారణంగా గండుగులపల్లి, దురదపాడు, రెడ్యాలపాడు, కేశప్పగూడెం, జారే గుంపు గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

'భూ భారతి'పై నేడు అవగాహన సదస్సు

అశ్వాపురం: నేడు మండల కేంద్రంలో తుశ్లారి ఫంక్షన్‌హాల్‌లో భూ భారతిపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ స్వర్ణలత ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో జరిగే ఈ అవగాహన సదస్సుకు జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు హాజరవుతారన్నారు. సదస్సుకు మండలంలో రైతులు, ప్రజలు హాజరై భూ భారతిపై సందేహాలు, సమస్యలు తెలుసుకోవాలన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో ప్రతిభ

అశ్వారావుపేట: జేఈఈ మెయిన్స్‌లో అశ్వారావుపేట వీకేడీవీఎస్ఆర్ కళాశాల విద్యార్థులు ర్యాంకులు సాధించి ఉత్కృత్తమ ప్రతిభ కనబరిచారని కళాశాల ప్రిన్సిపాల్ వెలుగోటి శేషబాబు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కోటగిరి షణ్ముఖ సాయి 330వ ర్యాంకు, కొచ్చర్ల భగత్ 5,191 ర్యాంకులు సాధించారని పేర్కొన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు, అధ్యాపకులకు, తల్లితండ్రులకు ధన్యవాదాలు తెలిపారు.

ఆర్థిక సాయం

మణుగూరురూరల్: మున్సిపాలిటీ పరిధిలోని రాజుపేటకు చెందిన బీఆర్ఎస్ కార్యకర్త మిడిదొడ్డి రాజారామ్ అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో వైద్యచికిత్సలు పొందుతుండగా.. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు ఆదివారం ఆస్పత్రిలో బాధితుడిని పరామర్శించి, రూ.5వేలను వితరణగా అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల, పట్టణ కన్వీనర్లు కుర్రి నాగేశ్వరరావు, కుంటా లక్ష్మణ్, దమ్మక్కపేట పంచాయితీ మహిళా నాయకురాలు మడి స్వరూప, నాయకులు పాల్గొన్నారు.

పరిష్కారంలో విఫలం

బూర్గంపాడు: ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు కుంజా కృష్ణ, డివిజన్ నాయకుడు వైఎస్‌రెడ్డి ఆరోపించారు. సారపాకలో ఆదివారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. గోదావరి వరద బాధితులకు శాశ్వత పరిష్కారం చూపాలని మూడేళ్లుగా ఆందోళన చేస్తున్న పాలకులకు కనీస పట్టింపు లేదన్నారు. సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీవైఎల్ జిల్లా నాయకులు బర్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల వార్షికోత్సవం

చంద్రుగొండ: మండలకేంద్రం చంద్రుగొండలోని ప్రతిభ విద్యాలయం సిల్వర్ జూబ్లీ ఉత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. పాఠశాల కరస్పాండెంట్ ఎండి.ఖాజాహుసేన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కొడకండ్ల వెంకటరెడ్డి, కాంగ్రెస్‌పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పునరుత్థానుడికి ఆరాధన

ఘనంగా ఈస్టర్ వేడుకలు

ఈస్టర్‌ను పురస్కరించుకుని ఆదివారం చర్చిల్లో ఘనంగా వేడుకలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే క్రైస్తవులు మందిరాలకు చేరుకుని పునరుత్థాన ఆరాధనలో పాల్గొన్నారు. ఏసుక్రీస్తు మరణమును జయించడంపై కీర్తనలు ఆలపించారు. దైవసేవకులు ఈస్టర్ సందేశాన్ని అందించి శుభాకాంక్షలు తెలిపారు. సంఘస్తులు ఒకరినొకరు శుభాకాంక్షలు చెప్పుకున్నారు. పురవీధుల్లో క్రైస్తవులు ర్యాలీలు నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్



అశ్వారావుపేటలోని చర్చ్‌లో క్రైస్తవుల ఈస్టర్ ఆరాధన..



బూర్గంపాడు: సారపాకలోని ఓ చర్చిలో ఈస్టర్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పాయం



ములకలపల్లి: చౌటిగూడెంలోని కల్వరి ప్రేయర్ టెంపుల్‌లో ప్రార్థనలు చేస్తూ..



చంద్రుగొండ: గానుగపాడు చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



చర్ల: సెయింట్ మేరీస్ చర్చిలో క్రీస్తు పునరుత్థానాన్ని వివరిస్తున్న పాస్టర్ ప్రవీణ్



మణుగూరుటౌన్: పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

ముమ్మరంగా పోలీసుల తనిఖీలు

చర్ల: చర్ల మండలంలో ఆదివారం పోలీసులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. మండల కేంద్రమైన చర్లలో ఆదివారం జరిగే వారపు సంతకు సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని ఆదివాసీలు సంతకు తరలివస్తుండగా.. వారి మాటున మావోయిస్టు సానుభూతిపరులు రావచ్చునన్న అనుమానంతో పోలీసులు ఈ తనిఖీలను చేపట్టారు. ప్రధాన రహదారులైన లెనిన్‌కాలనీ, తాలిపేరు ప్రాజెక్టు, కలివేరుక్రాస్‌రోడ్, దానవాయిపేట తదితర ప్రాంతాల్లో మోహరించిన సీఆర్‌పీఎఫ్, స్పెషల్ పార్టీ, సివిల్ పోలీసులు వచ్చిపోయే వారిని నిశితంగా తనిఖీ చేశారు. పలువురు అనుమానితులను విచారించి విడిచిపెట్టారు. తనిఖీల్లో సీఐ రాజువర్మతో పాటు ఎస్సైలు నర్సిరెడ్డి, కేశవ్‌లతో పాటు, సివిల్, స్పెషల్ పార్టీ, సీఆర్‌పీఎఫ్ పోలీసులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన

బూర్గంపాడు: బూర్గంపాడు మార్కెట్‌యార్డులోని ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆదివారం పరిశీలించారు. పాత గన్నీబ్యాగులు ఇస్తున్నందున ధాన్యం వృథా అవుతోందని ఈ సందర్భంగా రైతులు ఎమ్మెల్యేకు తెలిపగా.. చర్యలు తీసుకోవాల్సిందిగా ఆయన సంబంధిత జిల్లా అధికారులను ఫోన్‌లో సూచించారు. అనంతరం సారపాకలోని సుందరయ్యనగర్‌లో నూతన చర్చి భవన నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన..

అశ్వాపురం: ఎన్నో కాలాల పాటు ఉండే ఇందిరమ్మ ఇళ్లను నాణ్యతతో నిర్మించాలని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మండల పరిధిలోని తుమ్మలచెరువు గ్రామంలో పైలట్ ప్రాజెక్ట్‌గా లబ్ధిదారులకు నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను ఆదివారం ఎమ్మెల్యే పాయం పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి ఇళ్ల నిర్మాణ పనుల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం మాట్లాడుతూ.. నిర్మాణాలకు తరచూ వాటరింగ్ చేస్తూ నాణ్యతతో నిర్మించుకోవాలన్నారు. అనంతరం గొందిగూడెం గ్రామంలో గొల్లపల్లి కుటుంబీకులు నిర్వహిస్తున్న నాగరాజు స్వామి జాతర మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో పలు సమస్యలను నిర్వాహకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా ఆయన సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో నెల్లిపాక పీఏసీఎస్ తుక్కాని మధుసూదన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వంకా సత్యనారాయణ, మాజీ వైస్ ఎంపీపీ బేతం రామకృష్ణ, కాంగ్రెస్ నాయకులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఓరుగంటి రమేష్, ఆవుల రవి, సామకూరి వెంకన్న, బచ్చు వెంకటరమణ, బారాజు సంపత్, గొల్లపల్లి నరేష్, పర్వత నరేష్, శశికాంత్ తదితరులు పాల్గొన్నారు.



బూర్గంపాడు: జిల్లా అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

దాహం తీరే దారేదీ?





చలివేంద్రం ఏర్పాటు చేసిన బస్ షెల్టర్ ఇదే.., (ఇన్‌సెట్) వాహనాల మధ్య నీటి కుండలు

ములకలపల్లి: ములకలపల్లి మండలకేంద్రంలోని బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రానికి పార్కింగ్ వాహనాలు అడ్డంకిగా మారాయి. ములకలపల్లికి ప్రతినిత్యం సుమారు 20 కిలోమీటర్ల దూరం నుంచి శివారు గ్రామాల ప్రజలు వివిధ అవసరాల నిమిత్తం వస్తూపోతూ ఉంటారు. వీరి తాగునీటి కొరత తీర్చేందుకు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో బస్‌షెల్టర్‌లో చలివేంద్రం ఏర్పాటు చేశారు. అయితే.. బస్‌షెల్టర్ లోపల భారీగా ద్విచక్ర వాహనాలు, సైకిళ్లు నిలిపి ఉంచుతున్నారు. షల్టర్ ఎదుట ఆటోలు, ఇతర వాహనాలు పార్క్ చేస్తున్నారు. దీంతో దాహార్తి తీర్చుకుందామని వచ్చే వారికి బస్‌షెల్టర్‌లోకి వెళ్లే మార్గమే లేకుండా పోయింది. మంచినీటి కుండల వద్దకు వెళ్లే దారి పార్కింగ్ వాహనాలతో మూసుకుపోయింది. దీంతో చలివేంద్రం కాస్తా నిరుపయోగంగా మారింది. రోడ్డు విస్తరణలో భాగంగా రోడ్డు కిరువైపులా ఉన్న భారీ వృక్షాలను నేలమట్టం చేయడంతో ప్రజలు కాస్త బస్టాండ్ వైపుకు పార్కింగ్‌కు మళ్లినట్లు తెలుస్తోంది.